www.akshratimes.com



తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

PRGI.NO : APTEL /26/A4786

సంపుటి : 01 సంచిక : 25 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ ఆదివారం 05 - 07 - 2026


Published by EAST GODAVARI : Circulated by: East Godavari, Polavaram, Kakinada



బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు - బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

# వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

- ఇక ఆఫీసుల చుట్టూ తిరగనక్కర్లేదు!
- వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు
- రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు
- మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు చెక్
- రూ.10 లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100
- వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్‌ఎంసీ తప్పనిసరి



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు అనుమతించిన సర్కార్, తాజాగా మరో కీలక ముందడుగు వేసింది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి.. కొత్త విధానం ఇలా**

ఇంతకుముందు, కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే - మిగతా 2 లో

## ఆదర్శ గ్రామంగా నలగంపల్లె కుప్పం అంతటా 'నెట్ జీరో' మోడల్



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కుప్పంలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- 'నెట్ జీరో' విధానాన్ని పాటిస్తున్న నలగంపల్లె గ్రామంలో పర్యటన
- సౌర విద్యుత్ వినియోగంతో నెలకు రూ.400 ఆదా చేసుకుంటున్న గ్రామస్థులు
- సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించాలని, ఈవీలను చేర్చాలని సూచన

**అమరావతి :**

సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు పర్యటన కొనసాగించారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన నలగంపల్లె గ్రామాన్ని సందర్శించి, అక్కడి ప్రజలు అవలంబిస్తున్న వినూత్న 'నెట్ జీరో' విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. సౌర - మిగతా 2 లో




## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

- నేటి 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

## తీవ్ర వేడికి భగభగమంటున్న అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రద్దు!




- 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ వేడుకలకు సిద్ధమైన అమెరికా
- విపరీతమైన వేడి కారణంగా వేడుకలు రద్దు
- తీవ్రంగా ప్రభావితమవుతున్న విద్యుత్ వ్యవస్థ

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

- 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం
- హోంశాఖ పరిధిలోని పోలీస్, జైళ్లు, ఫైర్, ఎస్‌పీఎఫ్ విభాగాల్లో నియామకాలు
- ఇప్పటికే 5 వేల పోస్టులకు జీవోలు జారీ.. మరో 2 వేలకు త్వరలో ఉత్తర్వులు
- ఆర్థిక శాఖ అనుమతులు రావడంతో నోటిఫికేషన్‌కు సిద్ధమైన టీఎస్ఎల్‌పీఆర్‌బీ
- రాష్ట్రం ఏర్పడ్డాక ఇది నాలుగో అతిపెద్ద పోలీస్ క్రూట్‌మెంట్




## దేశ ప్రజలపై భారం పడకుండా చూశాం




- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం
- రాజస్థాన్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ ప్రారంభం
- రూ.1.06 లక్షల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- సంక్షోభ సమయంలో 40కి పైగా దేశాల నుంచి ఇంధన దిగుమతులు
- ప్రజలపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ సుంకం తగ్గింపు

**ఢిల్లీ :**

చురుకైన విధానాలు, విభిన్న ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయాలతో దేశ ప్రజలపై కనీస భారం పడేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రలో - మిగతా 2 లో

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ
- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం
- తీవ్ర నేరాల్లో జైలుకెళ్తే పదవులు రద్దు చేసే బిల్లును ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం



**ఢిల్లీ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ - మిగతా 2 లో



## ఈసీపై ఘాటుగా స్పందించిన కవిత

- పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం
- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత

**హైదరాబాద్ :**

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు - మిగతా 2 లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్



- తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది
- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

**హైదరాబాద్ :**

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. - మిగతా 2 లో

# మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే అప్పుల రాష్ట్రంగా మార్చారు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 20 ఏళ్ల ప్రజాప్రతినిధి ప్రస్థానానికి కృతజ్ఞత సభ
- పేదల మధ్య పెరిగిన నాకు ప్రజల సమస్యలు బాగా తెలుసు
- కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వ పనితీరును వివరించిన రేవంత్
- బీఆర్ఎస్‌కు గతం మాత్రమే ఉంది.. భవిష్యత్ లేదు



**హైదరాబాద్ :**

దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. - మిగతా 2 లో

# సంపాదకీయం

## జపాన్‌తో 'మిత్రలాభం'



శిఖరాగ్ర సమావేశాలకు దౌత్యంలో ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. రెండు దేశాల మధ్య ఆ స్థాయి సమావేశం జరిగిందంటే ఆ దేశాల అధినేతలు నేరుగా మాట్లాడుకుని, సంక్లిష్ట సమస్యల పరిష్కార సాధనకు కృషి చేస్తున్నారనీ, ఈ క్రమంలో ఎంతో జాప్యం చోటు చేసుకునే అధికారస్వామ్య ప్రమేయాన్ని అధిగమించ దల్చుకున్నారనీ అర్థం. జపాన్ ప్రధాని సనే తకాయిచి మన దేశంలో మూడు రోజులు పర్యటించి శుక్రవారం వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీతో శిఖరాగ్ర సమావేశం జరిపారు. ఈ పర్యటనలో కృత్రిమ మేధ(ఏఐ), ఇంధనం, రక్షణరంగం, ఖనిజాల వెలికితీత తదితర రంగాల్లో 17 ఒప్పందాలు కుదిరాయి.ఇందులో రక్షణ సాంకేతికతల్లో అత్యంతాధునికమైన 'యూనికార్న్' ప్రాజెక్టు ఒప్పందం అన్నివిధాలా ప్రత్యేకమైనది. యుద్ధ నౌకలపై వేర్వేరు అవసరాల కోసం వినియోగించే ఉపగ్రహ కమ్యూనికేషన్, రాడార్, నావిగేషన్, రేడియో కమ్యూని కేషన్ వంటి పనుల కోసం విడివిడిగా యాంటెన్నాలుంటాయి. యుద్ధసమయాల్లో ఇవి చిక్కులు తెస్తాయి. శత్రువుల రాడార్లకు సులభంగా దొరికిపోతాయి. యూనికార్న్ సాంకే తికతలో ఈ యాంటెన్నాలన్నీ ఒకే ఒకదాన్లో ఒదిగిపోతాయి.శత్రు నౌకలకు చిక్కకుండా, వాటి ఆనుపానుల్ని తెలుసుకోవటంలో దీని పని తీరు అద్భుతం. వచ్చిపడే క్షిపణుల్ని చాలా ముందే పసిగట్టడం, ఎదురుదాడికి అవకాశం ఇవ్వటం దీని ప్రత్యేకత. ఈ యూనికార్న్ మాస్ట్‌లను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ద్వారా దేశీయంగా తయారు చేసేందుకు జపాన్ సంసిద్ధత తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం రక్షణ ఎగుమతుల జోలికి పోవద్దని జపాన్ తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవలే తకాయిచీ సడలించారు.అమెరికా విధిస్తున్న అడ్డగోలు సుంకాలు, పశ్చిమాసియాలో ఏర్పడిన అనిశ్చితిరెండు దేశాలనూ సమంగా పీడిస్తున్నాయి. ఈ దశలో పరస్పర సహకారం మరింతగా పెరిగితే ఈ పరిస్థితిని అధిగమించవచ్చునన్న అభిప్రాయం రెండు దేశాలకూ ఉంది. జపాన్‌తో మన సంబంధాలు విలక్షణమైనవి. రెండు దేశాల సంబంధాలను అభివర్ణించ టానికి దౌత్యంలో కొన్ని విశేషణాలుంటాయి. సహజమైన, ప్రత్యేకమైన, విశ్వసనీయ మైన, అనివార్యమైన... వంటివి అందులో కొన్ని. జపాన్‌తో మన సంబంధాల స్థాయిని తెలియజేయటానికి చాలామంది దౌత్యనిపుణులు వీటిని ఉపయోగిస్తారు.కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నం. ఎంత మెరుగైన సంబంధాలున్నా అవి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందాన ఉన్నాయి. ఇరుదేశాలమధ్యా సుహృద్భావం ఉంది. వేరే దేశాలతో ఏర్పర్చుకునే సంబంధాలకుండే రాజకీయ పరిమితులు కూడా ఇక్కడ లేవు. చైనాతో ఇరు దేశాలకూ ఉండే సమస్యలవల్ల వాటి మధ్య సాన్నిహిత్యానికి అవకాశాలెక్కువ. కానీ ఆసంబంధాలు తగినంతగా ఎదగలేదు. ఇరు దేశాలమధ్యా వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడి చాన్నాళ్లవుతున్నా వ్యాపార సంబంధాలు అంతంతమాత్రం. ద్వైపాక్షిక వాణిజ్యం 2,748 కోట్ల డాలర్లున్నా అందులో మన ఎగుమతుల విలువ కేవలం 600 కోట్ల డాలర్లు. మిగిలిందంతా జపాన్ నుంచి మనకొచ్చే దిగుమతుల వాటాయే.మన దేశానికి 1991 వరకూ జపాన్ అధికారిక అభివృద్ధి సాయం(ఓడీఏ) కింద ఆర్థిక సాయం అందించేది. ఢిల్లీ మెట్రో, ఈశాన్య రాష్ట్రాల సరుకు రవాణా కారిడార్ వంటి మౌలిక సదుపాయాల్లో జపాన్ ముద్ర ఉంది. కానీ పెట్టుబడులు పెట్టడంలో, వాణిజ్య విస్తరణ అంతంతమాత్రం. మన దేశంలో జపాన్ పెట్టుబడులు 4,000 కోట్ల డాలర్లు. కానీ తరచు లడాయివుండే చైనాలో దాని పెట్టుబడులు 13,000 కోట్ల డాలర్ల పైమాటే. చిన్న దేశం వియత్నాంలో కూడా జపాన్ 8,000 కోట్ల డాలర్ల మదుపు పెట్టింది. మన దేశంలో పనిచేస్తున్న జపాన్ సంస్థలు 1,400 మించవు. ఇందుకుభిన్నంగా థాయ్‌లాండ్‌లో జపాన్ సంస్థల సంఖ్య 6,000. మన మొత్తం వ్యాపార కార్యకలాపాల్లో జపాన్ కంపెనీల వాటా ఒక శాతం. అందులో కూడా ఆటోమొబైల్ వాటాయే అధికం. మన జనరిక్ మందులపై జపాన్‌లో అనేక రకాల ఆంక్షలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మన ఫార్మా రంగం ఎన్నో విజయాలు సాధిస్తున్నా అక్కడ సమస్యలు తప్పడం లేదు. ఇలాంటి అవరోధాలు అధిగమించగలిగితే ఇరు దేశాల సంబంధాలూ మరింత మెరుగైన స్థాయికి చేర తాయి. తకాయిచీ పర్యటన ఆ దిశగా మంచి ముందడు గని చెప్పుకోవచ్చు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు.రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## తీవ్ర వేడికి భగభగమంటున్న అమెరికా

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించాల్సిన సాంప్రదాయ స్వాతంత్ర్య దిన పరేడ్‌ను తీవ్ర వేడి కారణంగా రద్దు చేశారు. ఈ ఉదయం జరగాల్సిన ఈ పరేడ్ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల రద్దు అయిందని నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ వాతావరణ సంస్థ ప్రకారం, సుమారు 16 కోట్ల అమెరికన్లు తీవ్ర వేడి హెచ్చరికలు (ఎక్స్‌ట్రీమ్ హీట్ వార్నింగ్స్) ఎదుర్కొంటున్నారు. తూర్పు అమెరికాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో జరిగే ఉత్సవాలు కూడా వేడి తీవ్రత కారణంగా మధ్యాహ్న భాగం రద్దు చేయాల్సి వచ్చింది.మరోవైపు, వేడిమికి తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఒక యువతిని ఆసుపత్రికి తరలించారు. గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫేర్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. న్యూయార్క్‌లో హీట్ ఇండెక్స్ 105 ఫారెన్‌హీట్ (41 డిగ్రీల సెల్సియస్)కి చేరుకుంది. విద్యుత్ గ్రిడ్లపై భారీ ఒత్తిడి పడుతోంది. వేలాది మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది.ఈ తీవ్ర వేడి అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాలు, ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌లు, విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫిఫా ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో హైడ్రేషన్ బ్రేకులు తప్పనిసరి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వేడిని ఎదుర్కోవడానికి కూలింగ్ సెంటర్లు, స్విమ్మింగ్ పూల్స్ సమయం పొడిగించడం వంటి చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న విశేష సందర్భం కావడంతో భారీ ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ ఉత్సవాలపై పెను ప్రభావం చూపాయి.

## మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు



**మొదటిపేజీ తరువాయి -** మీ దోపిడీకి అడ్డుకట్ట పడినందునే.. ప్రజాపాలన పోవాలని కోరుకుంటున్నారు. ప్రతిదాంట్లో కమీషన్లు తిన్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు'.'కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు పెరిగితే.. తెలంగాణకు అప్పులు మాత్రమే మిగిలాయి. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. సమస్యలపై ప్రతిపక్ష నేత మాట్లాడరంట. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తారట. వాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఆలోచించాలి. అరుంధతి సినిమాలో పశుపతిలా.. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటికొచ్చే పరిస్థితి లేదు. బీఆర్ఎస్‌కు అధికారం అన్నది కలే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు. మళ్లీ కాంగ్రెస్ రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. రాహుల్‌ను ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని అన్నారు.

## వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే 'ఆటో-మ్యుటేషన్' ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి.

### వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి

అయితే, ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.

### రైతులకు భారీ ఊరట

గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10 లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100 స్టాంప్ డ్యూటీగా, రూ. 10 లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతో పాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడం కూడా సులభతరం అవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.

## ఆదర్శ గ్రామంగా నలగంపల్లె.. కుప్పం అంతటా 'నెట్ జీరో' మోడల్

**మొదటిపేజీ తరువాయి -**

విద్యుత్ వినియోగం, వ్యర్థాల నిర్వహణ, నీటి పొదుపు వంటి పద్ధతులతో ఆదర్శంగా నిలుస్తున్న ఈ గ్రామంపై ఆయన ప్రశంసలు కురిపించారు.శనివారం ఉదయం నలగంపల్లె గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రి, స్థానిక ప్రజలతో కలిసిపోయారు. ఓ గ్రామస్థుని ఇంటికి స్వయంగా వెళ్లి, వారు ఏర్పాటు చేసుకున్న రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను పరిశీలించారు. "ఎన్ని ప్యానెళ్లు పెట్టారు? ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఇంటి అవసరాలకు సరిపోతుందా?" అని ఆరా తీశారు. సౌర విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నామని, దీనివల్ల గ్యాస్ సిలిండర్ ఖర్చుతో పాటు నెలకు సుమారు రూ.400 వరకు ఆదా చేసుకోగలుగుతున్నామని గ్రామస్థులు ముఖ్యమంత్రికి వివరించారు. గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాల భయం కూడా తప్పిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నలగంపల్లె గ్రామస్థులు అనుసరిస్తున్న వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ, కిచెన్ కంపోస్ట్ ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను చంద్రబాబు అభినందించారు. నలగంపల్లె గ్రామంలో అనుసరిస్తున్న ఈ విధానాన్ని ఒక కేస్ స్టడీగా తీసుకుంటామని ప్రకటించారు. ఈ 'నెట్ జీరో' విధానాన్ని కుప్పం నియోజకవర్గం వ్యాప్తంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, ఈ విధానంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని కూడా చేర్చాలని, 'సర్క్యులర్ ఎకానమీ'ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందని, ఈ నెట్ జీరో విధానం వారికి మరింత ప్రయోజనకరంగా ఉంటుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. కుప్పం నియోజకవర్గంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ద్వారా 7,489 మంది ఎస్సీ, ఎస్టీలు, 39,215 మంది బీసీలు, 7,381 మంది ఓసీలకు లబ్ధి చేకూరేలా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి -** ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్సీపీలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి.మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రజలపై భారం పడకుండా చూశాం

**మొదటిపేజీ తరువాయి -** దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రిఫైనరీ కాంప్లెక్స్‌ను పరిశీలించిన ఆయన, రిమోట్ బటన్ నొక్కి ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాల్లో ఒకటి ఏర్పడిందని ప్రధాని పేర్కొన్నారు. అనేక దేశాలు ఇంధన కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని చెప్పారు. అయితే భారత్ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సరైన వ్యూహంతో ముందుకెళ్లిందని తెలిపారు.సంక్షోభానికి ముందు భారత్ సుమారు 25 నుంచి 26 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేదని మోదీ చెప్పారు. పరిస్థితులు మారిన తర్వాత దిగుమతుల కోసం 40కి పైగా దేశాలతో సంబంధాలను విస్తరించినట్లు తెలిపారు. భారత దౌత్య బలాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఇంధన సంక్షోభం నుంచి దేశాన్ని బయటపడేశామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య చమురు సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాలను ఎదుర్కొన్నాయని ప్రధాని వెల్లడించారు. అయినప్పటికీ ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై మోపకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. లీటర్‌పై రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి సామాన్యులపై అదనపు భారం పడకుండా చూశామని వివరించారు.ఇంధన సంక్షోభ సమయంలో భారత్ విఫలమవు తుందని కొందరు భావించారని మోదీ విమర్శించారు. దేశంలో అనేక రకాల వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. భారత్ విఫలమవుతుందని అంచనాలు వేసిన వారు ఇప్పుడు నిరాశలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా భారత్ అవతరించిందని ప్రధాని తెలిపారు. ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళ్తోందని చెప్పారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన తొలి రిఫైనరీ కూడా ఇదేనని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లలో ఒకటిగా ఇది నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పశ్చిమ రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రాజస్థాన్ స్వావలంబన సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలకే పరిమి తమయ్యేవని ప్రధాని విమర్శించారు. శిలాఫలకాలు వేసిన తర్వాత ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచేవారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాల పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో బాధ్యత ముగిసిందని భావించకుండా వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని తెలిపారు. వీటిలో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-2 కీలకంగా ఉంది.స్వావలంబనతోనే స్వాభిమానాన్ని నిల బెట్టుకోవచ్చని, కొత్త ప్రాజెక్టులతో రాజస్థాన్‌తో పాటు దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి -** దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామి కవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. జులై 5న సియోల్‌లో ఇండియా దయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి.జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది.జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఉ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## ఈసీపై ఘాటుగా స్పందించిన కవిత

**మొదటిపేజీ తరువాయి -**

మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది.ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూ ర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరా బాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు.అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న)ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమా యత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర




**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పోలీస్ కొలువు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరదించుతూ, హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో భారీగా ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. పోలీస్, జైళ్లు, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) విభాగాలలో ఖాళీగా ఉన్న దాదాపు 7,000 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసే దిశగా, ప్రభుత్వం ఇప్పటికే 5,000 పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోలను జారీ చేసింది. మిగిలిన 2,000 పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించడంతో, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) సమగ్ర నోటిఫికేషన్ జారీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒకటి రెండు రోజుల్లోనే అభ్యర్థుల అర్హతలు, సిలబస్, పరీక్షల నిర్వహణ తేదీలతో కూడిన పూర్తి వివరాలను బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది.గత కొంతకాలంగా రాష్ట్రంలో కొత్త పోలీస్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, వయోపరిమితి సడలించాలని నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్న విషయం తెలిసిందే. వారి డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఈ నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా, పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేసేందుకు పోలీస్ బోర్డు అధికారులు విధివిధానాలను ఖరారు చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత హోంశాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. స్వరాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 2015 చివరి రోజున 9,281 పోస్టుల భర్తీకి తొలి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత, 2018లో రికార్డు స్థాయిలో 1,217 ఎస్సై, 16,285 కానిస్టేబుల్ పోస్టులతో రెండో విడత భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మూడో విడతగా 2022లో 554 ఎస్సై పోస్టులు, 15,644 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టారు. ఇప్పుడు నాలుగో విడతలో భాగంగా మరో 7,000 ఉద్యోగాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో, పోలీస్ శాఖలో స్థిరపడాలని కలలు కంటున్న వేలాది మంది నిరుద్యోగుల ఆశలు మళ్లీ చిగురించాయి. త్వరలో వెలువడనున్న అధికారిక నోటిఫికేషన్

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## అల్లూరి ఆశయాలే యువతకు ఆదర్శం జయంతి వేడుకల్లో సేవా కార్యక్రమాలు

ఉప్పల్,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్‌బీ కాలనీలో సూర్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భారతీయ జనతా పార్టీ హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ మునుగంటి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత అల్లూరి చూపిన మార్గంలో నడుస్తూ సమాజ సేవ, దేశ సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. మహనీయుల జయంతులను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జయంతి వేడుకల సందర్భంగా పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి విద్యే సమాజాభివృద్ధికి బలమైన ఆయుధమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల ద్వారా అల్లూరి సీతారామరాజు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజు సంఘం



నాయకులు పెరిచర్ల కృష్ణంరాజు, రాజ్ గోపాల్ రాజు, వాసు రాజుతో పాటు సూర్య యూత్ అసోసియేషన్ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం దేశభక్తి నినాదాలు, సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిదాయక వాతావరణంలో జరిగింది.

## మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులర్పించిన కంబాల

### సీఎండీ లేఅవుట్‌లో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



గోకవరం**జులై 04 .అక్షర టైమ్స్** : గోకవరం గ్రామం తంటికొండ రోడ్డులోని సీఎండీ లేఅవుట్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్‌ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కంబాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన దేశభక్తి,



ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కరిబండి వెంకటేశ్వరరావు, నాగ రమేష్, శ్రీమతి వీరాంజలి, బత్తిన వీరాంజనేయులు, తాటికొండ సురేష్, కేబుల్ రాజు, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఆదం మణికంఠ, పదిలం చక్రరావు, రెడ్నం వీర రాఘవ, వేగి సాంబ శివరావు, బొల్లం జానకి రామసేన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
## ఘనంగా ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు




మియాపూర్,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న మియాపూర్ పరిధిలో ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రసాద్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని, ఫౌండేషన్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజ సేవా కార్యక్రమాల్లో ప్రసాద్ రెడ్డి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అనంతరం ప్రసాద్ రెడ్డిని సాంప్రదాయ పద్ధతిలో శాలువాతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వకంగా అభినందనలు తెలియజేశారు. ఈ వేడుకల్లో మియాపూర్ డివిజన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ టీమ్ సభ్యులు దివ్య, భాస్కర్, శ్రీను చౌదరి తదితరులు పాల్గొని ప్రసాద్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా
## ముద్దంగుల తిరుపతి నియామకం



శేరిలింగంపల్లి,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్‌కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ముద్దంగుల తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి నియామకం పట్ల శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. అధిష్టానానికి కృతజ్ఞతలు ఈ సందర్భంగా ముద్దంగుల తిరుపతి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన: ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ మరియు పార్టీ సీనియర్ నాయకులకు, మహిళా నాయకురాళ్లకు, అనుబంధ సంఘాల ప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ?"పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, విలువలకు కట్టుబడి రంగారెడ్డి జిల్లా ప్రజల అభ్యున్నతి కోసం, పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తాను. ప్రజల ఆశీస్సులు, పార్టీ శ్రేణుల సహకారంతో నా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తాను."

## చర్లపల్లి కాంగ్రెస్‌కు కొత్త జోష్.. ప్రభు గౌడ్‌కు పరమేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం



చర్లపల్లి,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొడిగ ప్రభు గౌడ్ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తనకు అప్పగించిన బాధ్యతపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి ప్రభు గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమర్థ నాయకత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతున్న ప్రజా ఉద్యమ పార్టీ అని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. చర్లపల్లి డివిజన్‌లో పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకొని సమిష్టి నాయకత్వంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. స్థానిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత, పేదల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ, కొత్త కార్యకర్తలను ప్రోత్సహించి, కాంగ్రెస్ కుటుంబాన్ని మరింత విస్తరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బొడిగ ప్రభు గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానం, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి కార్యకర్తతో కలిసి సమిష్టిగా పనిచేస్తూ చర్లపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని పేర్కొన్న ప్రభు గౌడ్, డివిజన్‌లోని ప్రతి కాలనీ, ప్రతి బస్తీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా నిజాయితీ, పారదర్శకతతో సేవలు అందిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నసారం పాండు ముదిరాజ్, ఎస్. రాజు, బుడిగే వెంకట్ గౌడ్, సదానందం, పెద్దపల్లి శ్రీను, మధు, వెంకట్ రెడ్డి, గణేశ్ గౌడ్, దామోదర్ చారి తదితరులు పాల్గొని ప్రభు గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన నాయకత్వంలో చర్లపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని, ప్రజలకు మరింత చేరువవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు

## బీరముగూడలో సాగిన 'అక్రమ' తొలగింపు.. ట్రాఫిక్ కష్టాలకు చెక్.!

బీరముగూడ,**జులై 04 .అక్షర టైమ్స్ :** రోడ్ల విస్తరణకు ఆటంకంగా మారిన అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బీరముగూడ మెయిన్ రోడ్డు వెంబడి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన షాపులు, డబ్బాలు మరియు షట్టర్లను అధికారులు తొలగించారు.

**?ప్రజా భద్రతే లక్ష్యంగా చర్యలు:**

గత కొంతకాలంగా బీరముగూడ ప్రధాన రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన చిన్న చిన్న షాపులు, రేకుల షెడ్ల వల్ల వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పీక్ అవర్స్ సమయంలో ఇక్కడ గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడం, రోడ్డు ఆక్రమణల వల్ల ప్రమాదాలు సంభవించడంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన జీహెచ్ఎంసీ యంత్రాంగం,



ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో ఈ ఆక్రమణల తొలగింపు చర్యలను చేపట్టింది.

**స్థానికుల హర్షం:**

అక్రమ కట్టడాల తొలగింపుతో రోడ్డు విశాలంగా మారడంతో స్థానిక నివాసితులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "రోడ్డు మార్జిన్ వరకు దుకాణాలు రావడం వల్ల రోజూ ట్రాఫిక్ సమస్యగా ఉండేది. ఇప్పుడు అధికారులు ఖాళీ చేయించడం వల్ల రాకపోకలకు



వీలుగా మారింది," అని స్థానికులు పేర్కొన్నారు.

**?అధికారుల హెచ్చరిక:**

ఇకపై రోడ్లపై ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, భారీ జరిమానాలు విధిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు. రోడ్లు అందరికీ అందుబాటులో ఉండాలని, పబ్లిక్ సౌకర్యాలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## అమీన్‌పూర్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డికి ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు

### వీరేశ్,రమేష్ ఆధ్వర్యంలో ఇంద్రమ్మ కాలనీ వాసుల ఆత్మీయ పలకరింపు

అమీన్‌పూర్,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు , రమేష్ ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రమ్మ కాలనీ వాసులు, పార్టీ కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, పాండురంగారెడ్డి పదవిలో ఉన్నప్పుడు, ఆ తర్వాత కూడా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ముఖ్యంగా ఇంద్రమ్మ కాలనీ అభివృద్ధిలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని పేర్కొన్నారు.

**కాలనీ అభివృద్ధిలో పాండురంగారెడ్డి చేసిన సేవలు:**

నీటి సౌకర్యం: కాలనీ వాసుల నీటి కష్టాలను తీర్చడానికి తక్షణమే స్పందించి, సుమారు మూడు బోర్లు వేయించి తాగునీటి



సమస్యను పరిష్కరించారు. ధార్మిక సేవలు: వినాయక ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వినాయకుని మండపం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించడమే కాకుండా, స్వయంగా మండప నిర్మాణానికి సహకరించారు. మౌలిక సదుపాయాలు: మండపం వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా మట్టిని తరలించి వేదికను సిద్ధం చేయడంలో పాండురంగారెడ్డి చేసిన కృషిని కాలనీ వాసులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జాను. బ్రహ్మం. మోహన్. కె రమేష్. కే ప్రవీణ్. కే శ్రీను. కే పవన్.కాలనీ పెద్దలు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## షేర్స్ బజార్ పేరిట 'భూపాల్ నాయక్' ఘరానా మోసం

**వేల కోట్ల రూపాయలతో బోర్డు తిప్పేసిన కిసాన్ పరివార్**

**అధిక వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయలు టోకరా**

**కిసాన్ పరివార్ సంస్థలను నమ్మి రోడ్డున పడ్డ పెట్టుబడిదారులు**

**సైబరాబాద్ ఈ.ఓ.డబల్యూ సీపీ అధికారులను ఆశ్రయించిన బాధితులు**

శేరిలింగంపల్లి,**జులై 04 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న అధిక వడ్డీలు ఇస్తామంటూ నమ్మబలికి, అమాయక ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలు చేసి చేతులెత్తేసిన 'కిసాన్ పరివార్' సంస్థల నిర్వాహకుడు భూపాల్ నాయక్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కిసాన్ పరివార్, కిసాన్ పరివార్ లిమిటెడ్, కిసాన్ పరివార్ ఇండస్ట్రీస్, షేర్స్ బజార్ పేరిట కంపెనీలను స్థాపించిన భూపాల్ నాయక్, పెట్టుబడిదారులను భారీగా ఆకర్షించి చివరకు బోర్డు తిప్పేశాడు.

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్..**

ఈ భారీ కుంభకోణానికి సంబంధించి గుజరాత్ పోలీసులు గతంలోనే భూపాల్ నాయక్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. కాగా, పది రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం అతడిని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడిని గుజరాత్ నుండి తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు సమాచారం.

**సైబరాబాద్ సీపీ ఆఫీస్ మెట్లెక్కిన బాధితులు**




తమకు జరిగిన ఘోర అన్యాయంపై బాధితులు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియా ముందు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. "2022 నుంచి మేము ఈ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నాము. ప్రారంభంలో ఏడాది పాటు సక్రమంగానే వడ్డీలు చెల్లించి మా నమ్మకాన్ని చూరగొన్నారు. ఆ తర్వాత అసలు, వడ్డీ ఇవ్వకుండా నమ్మించి ముంచేశారు" అని బాధితులు వాపోయారు. బాధితుల ఫిర్యాదుపై స్పందించిన సైబరాబాద్ పోలీసులు, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**దేశవ్యాప్తంగా 6,000 మంది బాధితులు**

ఈ కుంభకోణంలో దేశవ్యాప్తంగా సుమారు 6,000 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) దాదాపు 1,200 మంది వరకు మోసపోయారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా ఈ భారీ మోసం సాగడం గమనార్హం.

**కన్నీరుమున్నీరవుతున్న బాధిత మహిళ..**

సీపీ కార్యాలయానికి వచ్చిన ఒక బాధిత మహిళ మీడియా ముందు కన్నీటిపర్యంతమైంది. "నా కూతురి పెళ్లి కోసం దాచుకున్న డబ్బులన్నీ ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఇందులో పెట్టుబడి పెట్టాను. తీరా వీళ్లు బోర్డు తిప్పేయడంతో వేరే దారి లేక బయట మళ్లీ అప్పులు చేసి కూతురి పెళ్లి చేయాల్సి వచ్చింది. మాలాంటి మధ్యతరగతి వాళ్లంతా రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే చొరవ తీసుకుని మా డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయాలి" అని ఆమె కోరింది. వివిధ కంపెనీల పేరిట వేల కోట్లు వసూలు చేసిన ఈ భారీ స్కామ్‌పై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

# మండల కాంగ్రెస్ సైన్యానికి తిరుగులేని రథసారథి..




**పెన్ పహాడ్,జులై 04.అక్షర టైమ్స్ :** పెన్ పహాడ్ కాంగ్రెస్ కోటపై మళ్లీ ఆ అజేయ సింహమే గర్జించింది. ప్రతి కార్యకర్తను తన కంటిపాపలా చూసుకునే నిఖార్సైన ప్రజా నాయకుడు, త్యాగాలకు నిలువెత్తు రూపం తూముల సురేష్ రావు రెండవసారి ఏకగ్రీవంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం పెన్ పహాడ్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ అఖండ విజయవార్త వినగానే మండలంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సంతోషంలో మునిగిపోయారు. సురేష్ రావు చారిత్రాత్మక ఎన్నికపై చెట్ల ముకుందాపురం గ్రామ సర్పంచ్, యువ కిశోరం పోనుగోటి నరేందర్ భావోద్వేగంతో కూడిన ప్రశంసల వర్షంకురిపించారు. ఈ విజయం ఒక పదవికి దక్కిన గౌరవం కాదు, సురేష్ రావు నిష్కల్మషమైన గుణానికి కార్యకర్తలు సమర్పించిన గురుదక్షిణ అని నరేందర్ ప్రకటించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నరేందర్ మాట్లాడుతూ, తూముల సురేష్ రావు దివంగత పులి, మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఆశయాల ఆయుధం అని కొనియాడారు. ప్రస్తుతం ఏఐసీసీ మణిహారం రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అడుగులో అడుగై, వారి నీడలా నడుస్తూ.. పార్టీ కోసం ప్రాణమిచ్చే నమ్మకమైన ప్రజా నాయకుడు సురేష్ రావు అని సగర్వంగా చాటారు. సర్వోత్తమ్ రెడ్డి నమ్మకానికి నిలువెత్తు రూపం సురేష్ రావు అని, ఆయన లాంటి అగ్నిపర్వతం లాంటి నాయకుడు దొరకడం పెన్ పహాడ్ మండల కార్యకర్తలు చేసుకున్న అదృష్టమని శ్లాఘించారు.తన జీవితాన్ని, సర్వస్వాన్ని కాంగ్రెస్ జెండాకే అంకితం చేసిన మహోన్నత త్యాగధనుడు, టీపీసిసి రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు వారసుడు సురేష్ రావు అని నరేందర్ గుర్తుచేశారు. సొంత స్వార్థాన్ని వదిలేసి, కేవలం కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు కోసమే అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. తండ్రికి తగ్గ తనయుడిగా పెన్ పహాడ్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎవరూ తాకలేనంత ఎత్తులో నిలిపారని కొనియాడారు.మండలంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా, ఏ పేదవాడికి ఆపద వచ్చినా మొదటగా గుర్తొచ్చే ఏకైక పేరు తూముల సురేష్ రావు మాత్రమేనని నరేందర్ అన్నారు. "అన్నా" అని ఒక్క పిలుపు పిలిస్తే చాలు.. ఏ అర్ధరాత్రైనా, ఎంతటి ప్రమాదకర పరిస్థితిలోనైనా "నేనున్నా" అంటూ వచ్చి, కొండంత భరోసా ఇచ్చే కరుణామయుడు సురేష్ రావు అని శ్లాఘించారు. కార్యకర్తల కష్టాన్ని తన కష్టంగా భావించి కన్నీరు తుడిచే ఇటువంటి నాయకుడు దొరకడం పెన్ పహాడ్ మండల చరిత్రలోనే ఒక అద్భుతమని ఆయన అన్నారు .ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ ఖాతాలో వేసి, పెన్ పహాడ్ మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపిన అసాధారణ, చారిత్రాత్మక ఘనత కేవలం సురేష్ రావు వ్యూహ చతురత, నాయకత్వ పటిమకే దక్కిందని నరేందర్ సగర్వంగా చాటారు. ప్రతి కార్యకర్తను సైనికుడిలా నడిపించి, శత్రువుల కోటలను బద్దలు కొట్టిన ఘనుడు ఆయన అని కొనియాడారు.కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడే సురేష్ రావు నిరంతర శ్రమ, అద్భుతమైన నాయకత్వ పటిమ వల్లే ప్రత్యర్థులకు గుండె వణుకు పుట్టిందని, అందుకే మండలమంతా ఏకతాటిపైకి వచ్చి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుందని నరేందర్ స్పష్టం చేశారు. సురేష్ రావు నాయకత్వంలో పెన్ పహాడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని సామ్రాజ్యం ఏర్పడుతుందని, శత్రువులకు సింహస్వప్నంలా నిలిచి రాబోయే రోజుల్లో చరిత్ర సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సురేష్ రావు భవిష్యత్తులో రాజకీయాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయనకు భగవంతుడు అఖండ ఆయురారోగ్యాలు, విజయాలు ప్రసాదించాలని సర్పంచ్ పోనుగోటి నరేందర్ ఆకాంక్షించారు.


# పేదవాడి గుండె చప్పుడు 'వీరేష్'..

**ఇందిరమ్మ కాలనీ కష్టాలపై జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం**

**పదవి హోదా కాదు.. బాధ్యత అని నిరూపిస్తున్న స్పెషల్ అడ్వైజర్**

**848 పేద కుటుంబాల కన్నీరు తుడిచేందుకు నిరంతర పోరాటం..**




TELANGANA AUTO MOTOR DRIVERS
CO-OPERATIVE HOUSING SOCIETY LTD.,
KTR NAGAR

Honorable President VEMULA MARAIAH Cell: 9246558874
Chief Honorable Advisor SHANKAR LALA RAMAVATH Cell: 9700668913

President: Lokesh
Vice-President: R. Bichu Naik
Gen-Secretary: D. Prathap Naik
Joint Secretary Shekar Gunti
Organizer-Secretary Ramesh
Treasurer: Katravath Lokya Naik
Sports and Cultural Secretary's Bandaru Kiran, Upalapak Ravi, M. Pandu
Spl: Advisor Mala Veresh
Executive Members: 1. Banoth Kalyan 2. Eslavath Naresh 3. Ranga Swamy 4. Sidha Lingaiah 5. Yesaiah 6. Upalapati Ravi 7. K. Ramu Naik 8. Puna Madhu 9. Manya Naik 10. Y. Naresh 11. D. Prakash

విన్నపము
అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ గారికి
విషయం:
14 OCT 2025
30 JUN 2026

**శేర్లింగంపల్లి,జులై 04.అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న సమాజంలో పదవులు రావడం, పోవడం సహజం. కానీ, వచ్చిన పదవిని కేవలం హోదాగా కాకుండా.. సమాజ శ్రేయస్సు కోసం, పేద ప్రజల కన్నీళ్లు తుడవడం కోసం ఒక అస్త్రంగా వాడుతున్నారు 'తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' స్పెషల్ అడ్వైజర్ వీరేష్. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కేటీఆర్ నగర్, ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న సుమారు 848 పేద కుటుంబాల కష్టాలను తన కష్టాలుగా భావించి, వారు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషి స్థానికులకు కొండంత అండగా నిలుస్తోంది. తాజాగా కాలనీ సమస్యలపై జోనల్ కమిషనర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా నరకప్రాయం.. కాలనీ ప్రజల ఆవేదన! గత ఐదు సంవత్సరాలుగా ఇందిరమ్మ కాలనీ వాసులు మౌలిక వసతుల లేమితో తీవ్ర అల్లాడుతున్నారు. ముఖ్యంగా: తాగునీటి కష్టాలు: వాటర్ మోటార్ల సమస్యల వల్ల గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అస్తవ్యస్త డ్రైనేజీ: డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో వీధులన్నీ నరకకూపాలుగా మారాయి. దోమల వ్యాప్తి పెరిగి, చిన్నపిల్లలు, వృద్ధులు నిత్యం అనారోగ్యాల బారిన పడుతున్నారు. తమ జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, కనీస మానవ హక్కులు కూడా కోల్పోతున్నామని స్థానిక ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. అధికారుల చుట్టూ వీరేష్ 'ప్రదక్షిణలు'.. గళమెత్తిన ప్రజానేత! కాలనీ ప్రజల ఆవేదనను చూసి చలించిపోయిన వీరేష్, తానే స్వయంగా రంగంలోకి దిగారు. బాధితుల పక్షాన నిలిచి, వారి గొంతుకై గళమెత్తారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి: జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ వరకు ప్రతి ఒక్క అధికారిని కలిసి, వినతి పత్రాలను సమర్పిస్తూ కాలనీలో డ్రైనేజీ, నీటి సరఫరా వ్యవస్థలను వెంటనే మెరుగుపరచాలని పట్టుబట్టారు. రాజకీయ నాయకుల స్పందన కోరుతూ: అధికారులతోనే ఆగకుండా, స్థానిక రాజకీయ నాయకులను కూడా కలిసి, కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. "ఆకలిని చూశాను.. పోరాటం ఆపను!" ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ.. "ఇందిరమ్మ కాలనీలో నివసించే ప్రతి కుటుంబం పడుతున్న ఆకలిని, కష్టాన్ని నేను చాలా దగ్గరగా చూశాను. నా బాధ్యతగా వారి కష్టాల్లో తోడుగా నిలిచాను. కాలనీకి కనీస సౌకర్యాలు కల్పించే వరకు, పేద ప్రజల ముఖాల్లో నవ్వులు చూసే వరకు నా పోరాటం ఆగే ప్రసక్తే లేదు" అని సింహగర్జన చేశారు. స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది! ఒక నాయకుడు అనే వ్యక్తి పదవుల కోసం పాకులాడకుండా, ప్రజా సంక్షేమం కోసం ఎలా పనిచేయాలనేదానికి వీరేష్ నేటి సమాజానికి ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన చేస్తున్న ఈ నిస్వార్థ కృషిని స్థానిక యంత్రాంగం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులు ఇకనైనా కాలయాపన చేయకుండా, తక్షణమే స్పందించి ఆ 848 కుటుంబాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు. వీరేష్ లాంటి నాయకుడు తమకు తోడుగా ఉండటం కాలనీ ప్రజల అదృష్టమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఐఐఐటీ గచ్చిబౌలిలో విషాదం - ఆరో అంతస్తు నుంచి దూకి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



**గచ్చిబౌలి,జులై 04.అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యాసంస్థ ఐఐఐటీ గచ్చిబౌలిలో శనివారం తెల్లవారుజామున ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి హాస్టల్ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**ఘటన వివరాలు:**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన అనిరుద్ (20) ఐఐఐటీ గచ్చిబౌలిలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తెల్లవారుజామున తాను ఉంటున్న హాస్టల్ బిల్డింగ్ ఆరో అంతస్తు పైనుంచి అతడు కిందకు దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో అనిరుద్ అక్కడికక్కడే మృతి చెందాడు.

**ఆత్మహత్యకు గల కారణాలు:**

మృతుడు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు, కొన్ని వ్యక్తిగత/కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. ఈ మానసిక ఒత్తిడి కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

రంగంలోకి దిగిన పోలీసులు:

సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుపుతున్నారు.

**క్యాంపస్‌లో విషాద ఛాయలు:**

ప్రతిభావంతుడైన విద్యార్థి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో తోటి విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఐఐఐటీ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. క్యాంపస్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. అనిరుద్ మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మానవత్వానికి చిరునామా బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు

**అనాథ అంకాలయ్య యస్టి ఎరుకలకు అండగా నిలిచి శస్త్రచికిత్స చేయించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్**

**దాతల సహకారానికి కృతజ్ఞతలు**



**గిద్దలూరు,జులై 04.అక్షర టైమ్స్ :** కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని మరోసారి నిరూపించారు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ పంచాయతీలోని అంకాలమ్మపల్లె గ్రామానికి చెందిన నల్లగుంట్ల అంకాలయ్య యస్ టి ఎరుకల దుర్భర పరిస్థితిని తెలుసుకుని ఆయనకు అండగా నిలిచి మెరుగైన వైద్యం అందేలా కృషి చేశారు.చిన్నతనంలోనే స్వగ్రామాన్ని విడిచి గుంటూరులో వంట మాస్టర్‌గా జీవనం సాగించిన అంకాలయ్యకు ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తుంటి ఎముక విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందని పరిస్థితి నెలకొంది.ఈ విషయాన్ని గ్రామస్థులు, టీడీపీ యువ నాయకుడు మరిబోయిన వీరశేఖర్, బోగిరి తిరుపాలయ్య టీచర్ ద్వారా తెలుసుకున్న బి యస్ నారాయణరెడ్డి వెంటనే అంకాలమ్మపల్లెకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. తొలుత గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. వారం రోజులపాటు వైద్య పరీక్షల అనంతరం దాతల ఆర్థిక సహాయంతో తుంటి ఎముకకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గత పది రోజులుగా అంకాలయ్యకు దగ్గరుండి సేవలందించిన బి యస్ నారాయణరెడ్డి సేవలను గ్రామస్థులు హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా బి యస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అంకాలయ్యకు సేవ చేసే అవకాశం కల్పించిన అంకాలమ్మపల్లె గ్రామ యువకులు, గ్రామస్థులు, ఆర్థిక సహాయం అందించిన మిత్రులు దాతలు, వైద్యులు,సంబంధిత అధికారులు, మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తాను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్, జి.హెచ్.ఆర్.ఏ.సి.సి.పి.సి.ఐ మానవ హక్కుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సమాజ సేవను కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. నల్లగుంట్ల అంకాలయ్యకు ఇంకా వారం రోజుల పాటు ఆసుపత్రిలో వైద్య సేవలు అవసరమని, చికిత్స పూర్తయ్యే వరకు అదనపు ఆర్థిక సహాయం అవసరముందని తెలిపారు. మానవత్వంతో స్పందించే దాతలు ముందుకు వచ్చి సహకరించాలని బి యస్ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు."మనిషికి మనిషే తోడు అవసరంలో అండగా నిలవడమే నిజమైన సేవ" అనే సందేశాన్ని ఈ సేవా కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు.9441932390 సంప్రదించాలన్నారు

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..



**పొదలకూరు,జులై 04.అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ పొదలకూరు సెక్టార్ పరిధిలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన, సీడీపీఓ విజయలక్ష్మీ సూచించారు. శనివారం వారు పట్టణంలోని 1,2,4 సచివాలయాలను పరిశీలించారు.అనంతరం నరసారెడ్డి కాలనీ, రామ నగర్ ,లింగంపల్లి తోపు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదులు, సేవల అమలు, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివ కృష్ణయ్య, వీఆర్ఓ శ్రీహరి, బీఎల్ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా కాకాణి పూజిత జన్మదిన వేడుకలు..





**పొదలకూరు,జులై 04.అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ పొదలకూరు లో శనివారం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె, ఆంధ్ర రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయురాలిగా కాకాణి గోవర్ధన్ రెడ్డి గారి మీద అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపినప్పుడు సర్వేపల్లి నియోజకవర్గంలో శక్తివంచన లేకుండా తమ నాయకుల్ని కార్యకర్తలని కాపాడుకుంటూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో పోరాటం చేసినటువంటి ధీరవనిత కాకాణి పూజితమ్మ అని పేర్కొన్నారు. దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోనశీ చిన్న బ్రహ్మయ్య మాట్లాడుతూ కాకాణి పూజితమ్మ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని అలాగే ఆమె అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జడ్పిటిసి సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ మాట్లాడుతూ జగనన్న కోసం గోవర్ధన్ అన్న కోసం మహిళా సాధికారత కోసం ఎనలేని సేవలు చేస్తున్నటువంటి కాకాణి పూజితమ్మ గారిని ఎమ్మెల్యేగా చూడాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు పూజితమ్మ జన్మదిన సందర్భంగా రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# అమర భక్తుడు చిలకపాటి మాస్ మనోహర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



**కావలి,జులై 04.అక్షర టైమ్స్ :** కంటి సమస్యతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కావ్య అంటే పరితపించే అమర భక్తుడు అయిన భక్త కన్నప్పను తలపించే అంతటి శక్తి సామర్థ్యాలు ఆయనకోసం వెచ్చించే శిష్యుడు చిలకపాటి మాస్ మనోహర్ ను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. విజయవాడ హాస్పిటల్లో కంటికి ఆపరేషన్ చేయించడం జరిగింది. కంటి ఆపరేషన్ జరిగిన పరిస్థితులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని వారికి సూచించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పట్టణ ప్రధాన కార్య దర్శి జ్యోతి బాబూరావు, దేవా , రామకృష్ణ, జనిగర్ల మహేంద్ర, పెనుమల్ల అశోక్, టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా

**79వ జయంతి వేడుకల్లో పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు**



**గోకవరం,జులై 04.అక్షర టైమ్స్ :** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత నాయకుడు వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి వేడుకలు గోకవరంలో యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు గాజింగం నాని, దాసరి తమ్మన్న దొరలతో కలిసి వంగవీటి మోహన్ రంగా, ఎస్వీ రంగారావు విగ్రహాలకు



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కటింగ్ నిర్వహించి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాకుండా, పేదల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రముఖులు, యువత తదితరులు పాల్గొన్నారు.

అక్షర టైమ్స్

# భూ భారతి పోర్టల్‌లోకి చొరబడిన దొంగలు

**రాత్రికి రాత్రే రూ.కోట్ల విలువైన భూముల మార్పిడి**

**గుట్టుగా పోర్టల్‌లోకి చొరబడి హక్కులు మార్చేసిన అక్రమార్కులు**

**అసైన్డ్, ప్రభుత్వ భూముల్లోనూ రిజిస్ట్రేషన్లు**

**ప్రభుత్వానికి అందిన ఫోరెన్సిక్ నివేదికలో కీలక అంశాలు**

**అక్రమాలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం**




ధరణి/ భూభారతిలోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఏకంగా పోర్టల్‌లోకి చొరబడ్డారు. గుట్టుగా భూముల హక్కులను మార్చేశారు. అసైన్డ్, ప్రభుత్వ భూముల్లోనూ రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రభుత్వానికి అందిన ఫోరెన్సిక్ నివేదికలో కీలక అంశాలు ఉన్నాయి. అక్రమాలను తీవ్రంగా పరిణించిన ప్రభుత్వం, చర్యల కోసం ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకుని ఉన్న ఓ జిల్లాలో ఓ వ్యక్తి పేరుపైకి రాత్రికి రాత్రే రూ.కోట్ల విలువైన కొన్ని ఎకరాల భూముల మార్పిడి జరిగింది. మరో జిల్లాలో రైతులు ప్రభుత్వానికి చెల్లించిన రిజిస్ట్రేషన్ల ఛార్జీ మొత్తాన్ని మధ్యలోనే కాజేశారు. ఇలాంటి అక్రమాలు సాగుభూముల పోర్టల్‌లో భారీగానే చోటు చేసుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది జనవరిలో భువనగిరిలో అక్రమాలు వెలుగు చూడటంతో ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది.రెవెన్యూ, సైబర్ క్రైమ్స్, రిజిస్ట్రేషన్లు, ఎన్ఐసీ, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాల నిపుణులు రంగంలోకి దిగారు. లోతైన విచారణ తర్వాత సర్కారుకు నివేదిక అందజేశారు. అక్రమాలకు పాల్పడ్డ బాధ్యులపై ఎలా చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేయడానికి జిల్లాల కలెక్టర్లు, ఐటీ కమ్యూనికేషన్స్, ఎన్ఐసీ, సైబర్ క్రైమ్ నిపుణులతో ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.విలువైన భూములే లక్ష్యంగా పోర్టల్‌లో అక్రమాలకు తెగబడ్డట్టు తెలుస్తోంది. ఆధారాలేవీ వెబ్‌సైట్‌లో చేర్చకుండానే కొన్ని భూముల యాజమాన్య హక్కులు మారినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూములకు సైతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. వివాదాల్లో ఉన్న భూములకూ యాజమాన్య హక్కులు సృష్టించారు. సర్వే నంబర్లు లేని భూములకు కొత్తవి సృష్టించడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అధికారికంగా దస్త్రాల బట్వాడా లేకుండానే పలు కంప్యూటర్లను వినియోగించినట్లు అనంతరం డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను గుర్తించకుండా అక్రమార్కులు జాగ్రత్త పడ్డట్లు భావిస్తున్నారు.పలు మాడ్యూళ్లను వినియోగించి ఇలా హక్కుల మార్పిడి చేసినట్లు ఫోరెన్సిక్ విచారణలో నిపుణుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ఎవరు ఈ అక్రమాలకు పాల్పడ్డారనేది గుర్తించి, ఎలాంటి చర్యలు చేపట్టాలనేది ప్రత్యేక బృందం ప్రభుత్వానికి నివేదించనుంది. అక్రమార్కులు వినియోగించిన టెక్నాలజీ, అక్రమాల బాధ్యులు, సహకరించింది ఎవరో కూడా గుర్తించనున్నారు.ధరణి పోర్టల్ రూపకల్పన, నిర్వహణను 2020లో ఓ ప్రైవేటు సంస్థ చేపట్టింది. ఆ ఏడాది నవంబర్ రెండో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు-మ్యుటేషన్లు ప్రారంభమయ్యాయి. మీసేవా కేంద్రాల ద్వారా పోర్టల్‌లోని మాడ్యూళ్ల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే ఆ మేరకు సేవలు అందేలా డిజైన్ చేశారు. పోర్టల్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం 2021 నుంచి దశల వారీగా 33 మాడ్యూళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే వాటిని ఆసరాగా తీసుకుని కొందరు పోర్టల్‌లోకి చొరబడినట్లు అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను భూభారతిగా మార్చింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్-చీ×జ భూభారతిని నిర్వహిస్తున్నా, ధరణి నాటి సాంకేతికతే ఉండిపోయింది.పోర్టల్‌లో సరైన సైబర్ రక్షణ లేకపోవడంతో పలువురు చొరబడినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో యాదాద్రి, జగిత్యాల జిల్లాల్లో వెలుగులోకి వచ్చిన రిజిస్ట్రేషన్ల ఛార్జీల దారి మళ్లింపు కూడా ఇదే విధంగా జరిగింది. దాని ఆనుపానులను శోధించగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆన్‌లైన్/మీసేవా కేంద్రాలకు లింకులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో కొందరు నిర్వాహకులను కూడా విచారించారు. ఇదే తరహాలో ఉమ్మడి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో భూ యాజమాన్య హక్కులను కూడా మార్చినట్లు తెలిసింది.సాంకేతికతపై పట్టున్న పలువురు, రెవెన్యూ కార్యకలాపాలతో సంబంధం ఉన్న మరికొందరు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అనుమానం ఉన్న చోట్ల ఆడిట్ నిర్వహించారు. సాంకేతిక లోపాలను అవకాశంగా తీసుకునే భూదస్త్రాల్లో మార్పులు, యాజమాన్య హక్కుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించినట్టు తెలుస్తోంది.

# 51వ సారి రక్తదానం చేసిన మేమున్నాం సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్ రెడ్డి



**గిద్దలూరు,జులై 04.అక్షర టైమ్స్ :** గిద్దలూరు పట్టణం నందు ఓ ప్రైవేటు హాస్పిటల్ నందు ఓ మహిళకు ఆపరేషన్ కొరకు అత్యవసరముగా ాంపాజిటివ్ రక్తం అవసరం కాగా మేమున్నాం సేవాసమితి సభ్యులు చల్లా అశోక్ రెడ్డి స్పందించి వెంటనే రక్తదానం చేశారు . ఇప్పటి వరకు 51సార్లు రక్తదానం చేయడం జరిగింది అని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తి దాయకంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మరో ప్రాణానికి ఆయువు పోయాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ రక్తం అవసరం కోసం ఈ కింద నంబర్ ను సంప్రదించగలరు అని తెలిపారు 9959954610

# విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమానికి అన్నదానవో చేసిన కామూరి రమణారెడ్డి



**కొమరోలు,జులై 04.అక్షర టైమ్స్ :** మార్కాపురం జిల్లా కొమరోలు మండలం గోపాలుని పల్లి గ్రామంలో పోలేరమ్మ, నాగమ్మ, పోతురాజు విగ్రహాలు ప్రతిష్ట కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి వస్తున్న భక్తుల కొరకు వైసిపి నాయకులు మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కామూరి రమణారెడ్డి ప్రారంభించారు అంతకుముందు ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అన్నదానానికి సహకరించిన దాత రమణారెడ్డికి ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# పురమిత్ర యాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు

**మున్సిపల్ సేవలు వేగంగా అందేలా ఏర్పాట్లు**

**పట్టణ ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు**

**ఒక కాలనీలో ఒకే సమస్య ఉంటే ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధి తరఫున ఒకే ఫిర్యాదు నమోదు చేసే అవకాశం**

**ప్రజాదరణ పొందిన పురమిత్ర యాప్**




పట్టణ ప్రాంత ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌లో నాలుగు కీలకమైన కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పటికే ప్రజల్లో మంచి ఆదరణ పొందిన ఈ యాప్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సేవ్ మై ప్రాపర్టీ', రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ఇంటిగ్రేషన్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్, సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ వంటి సదుపాయాలను ప్రవేశపెడుతున్నారు. ఈ మార్పులతో పురమిత్ర యాప్‌ను కేవలం ఫిర్యాదుల నమోదు వేదికగా కాకుండా సమగ్ర పౌర సేవల డిజిటల్ ప్లాట్‌ఫారంగా అభివృద్ధి చేస్తున్నారు.డివిజన్లు, వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి పౌర సమస్యలను ప్రజలు నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది మార్చి 16న పురమిత్ర యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల పరిధిలో 18.44 లక్షల మంది ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు నమోదైన 1.45 లక్షల ఫిర్యాదుల్లో 98 శాతం సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. యాప్ పనితీరును సమీక్షించిన ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసేలా సాంకేతికంగా మరిన్ని సౌకర్యాలను జోడిస్తోంది.కొత్తగా ప్రవేశపెడుతున్న 'సేవ్ మై ప్రాపర్టీ' ఫీచర్ ద్వారా ఇళ్ల యజమానులు లేదా అద్దెకు నివసించే వారు తమ ఇంటి వివరాలను ఒకసారి మాత్రమే యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. అనంతరం ఎలాంటి ఫిర్యాదు చేసినా ప్రతిసారి ఇంటి చిరునామా నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అలాగే మున్సిపల్ సిబ్బంది సంబంధిత ప్రదేశాన్ని సులభంగా గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుంది.కాలనీల్లో ఒకే సమస్యపై పలువురు నివాసితులు విడివిడిగా ఫిర్యాదులు చేయడం వల్ల వ్యవస్థపై అనవసర భారం పడుతోంది. ఈ సమస్యను నివారించేందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లను (ఆర్‌డబ్ల్యూఏలు) పురమిత్ర యాప్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇకపై ఒక కాలనీలో ఒకే సమస్య ఉంటే ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధి తరఫున ఒకే ఫిర్యాదు నమోదు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఫిర్యాదుల పునరావృతం తగ్గడంతో పాటు సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సమర్థవంతంగా సాగనుంది.పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రజల అభిప్రాయాన్ని నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ ఫీచర్ ద్వారా సేవలపై ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలు, అసంతృప్తిని నమోదు చేయవచ్చు. ఈ సమాచారం ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ ద్వారా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారిక ప్రకటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, తాజా సమాచారం, ప్రజలకు అవసరమైన అవగాహన సందేశాలు అన్నీ పురమిత్ర యాప్‌లోనే అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రజలు వివిధ ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది.పురమిత్ర యాప్‌లో మరో కీలకమైన సదుపాయంగా 'హాట్ స్పాట్' గుర్తింపు వ్యవస్థను అమలు చేస్తున్నారు. 100 మీటర్ల పరిధిలో ఒకే సమస్యపై అయిదు కంటే ఎక్కువ ఫిర్యాదులు నమోదైతే ఆ ప్రాంతాన్ని హాట్ స్పాట్‌గా గుర్తిస్తారు. అలాంటి ప్రాంతాలకు మున్సిపల్ కమిషనర్లు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి స్వయంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుంది. దీని ద్వారా తరచుగా సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది.కొత్త ఫీచర్లతో పురమిత్ర యాప్ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన డిజిటల్ సేవల వేదికగా మారనుంది. ఫిర్యాదుల నమోదు నుంచి సమస్యల పరిష్కారం వరకు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను సేకరించడం, ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం వంటి చర్యలతో పట్టణ పాలనలో పారదర్శకత, వేగం, ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

# తిక్కవరపు రామీరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తూ పదోన్నతి పై వెళుతున్న మాలిని,ఆసిఫ్ అహ్మద్ లకు ఘన సన్మానం



**కందుకూరు,జులై 04.అక్షర టైమ్స్ :** తిక్కవరపు రామీరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు పనిచేస్తూ పదోన్నతి పై వెళుతున్న మాలిని,ఆసిఫ్ అహ్మద్ లకు ఘనముగా సన్మానము జరిగింది.కళాశాల నందు జూనియర్ అసిస్టెంట్ గా పనిచేయుచున్న షేక్ మాలిని నకు పదోన్నతి కల్పించి సీనియర్ అసిస్టెంట్ గా అదే కళాశాలలో పోస్టింగు ఇవ్వడం జరిగినది. అలాగే రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేయుచున్న షేక్ ఆసిఫ్ అహ్మద్ నకు టైపిస్టుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల టంగుటూరునకు పదోన్నతి కల్పించడం జరిగినది. వీరిద్దరికీ కళాశాల ప్రిన్సిపల్ దాసరి శిరీష వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.కళాశాల నందు పనిచేసిన విషయాలను గుర్తు చేసుకుని పదోన్నతిపై వెళు న్న వారికి వెళ్ళిన చోట ఇంకా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని తెలియజేశారు.అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది వీరిని గురించి మిక్కిలి కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ గా ఇదే కళాశాలలో పోస్టింగ్ రావటం చాలా ఆనందంగా ఉందని మాలిని ఆనందం వ్యక్తం చేశారు. టైపిస్టుగా పదోన్నతి పొందిన షేక్ ఆసిఫ్ అహ్మద్ మాట్లాడుతూ ఈ కళాశాల నందు పనిచేసిన కాలం చాలా సంతృప్తినిచ్చిందని అధ్యాపక బృందం మొత్తం మంచి సహాయ సహకారాలు అందించారని వారి మేలు ఎప్పటికీ మరువనని, ఈ కళాశాలను విద్యార్థులను ఎప్పటికీ మర్చిపోనని తెలియజేశారు.అనంతరం ఆధ్యాపక బృందం శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఓరుగంటి వెంకటేశ్వరరావు, కాశీ రత్నం, హజరతయ్యా, కట్ట సుబ్బారావు, ఖాదర్ వలీ, మాధవరావు, రాజు, నరసింహారావు, సీతారావమ్మ, శివకుమారి, మాధవిలక్ష్మీ, షాలిమా, చాముండేశ్వరి,మెరిగ్రేస్, యామిని,అక్రమ్ రిటైర్డ్ అధ్యాపకులు మస్తాన్వలి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ ఒడిలోంచి నెల శిశువు కిడ్నాప్

**కోల్‌కతాకు తరలించే యత్నం**

**48 గంటల్లో ఛేదించిన పోలీసులు**

**ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న తల్లి నుంచి నెల శిశువును లాక్కెళ్లిన దుండగులు**

**చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**కోల్‌కతాకు పాపను తరలిద్దామని ట్రాఫికర్ల పథకం**

**పాపను తల్లికి సురక్షితంగా అప్పజెప్పిన పోలీసులు**

నెల రోజుల శిశువు కిడ్నాప్ కేసును చందానగర్ పోలీసులు ఛేదించారు. కేవలం 48 గంటల్లో పాపను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కోల్‌కతాకు చెందిన మహిళ తనకు ఓ శిశువు కావాలని హైదరాబాద్‌లో ఉన్న తన చిన్నమ్మకు చెప్పింది. దీంతో నెల శిశువు కిడ్నాప్‌కు బీజం పడింది. సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్ శుక్రవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.కర్ణటకలోని బీదర్ జిల్లా బాల్కి గ్రామానికి చెందిన మాలన్ బౌరవ్ శాంతా బాయి, తన కుటుంబ సభ్యులతో కలిసి సర్కస్ ప్రదర్శిస్తుంటారు. వారు తమ జీవనాన్ని ఫుట్‌పాత్‌లపై సాగిస్తుంటారు. అలా జూన్ 30న లింగంపల్లిలోని ఫుట్‌పాత్‌పై ఆమె తన పాపతో నిద్రపోయింది. ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె నెల రోజుల శిశువును తన ఒడిలోంచి లాక్కున్నారు. పాపను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ దక్కలేదు. పాపను తీసుకుని నిందితులు ఆటోలో పారిపోయారు. ఆమె చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నేరేడ్‌మెట్‌లో నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.జూన్ 30వ తేదీన అర్ధరాత్రి 2 గంటల సమయంలో రైల్వేస్టేషన్‌లో బీదర్‌కు చెందిన వలస కార్మికులు నిద్రిస్తున్నప్పుడు వారి నెల రోజుల పాపను కిడ్నాప్ చేశారు. రెండు గంటల తర్వాత పోలీసు స్టేషన్‌లో పాప తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ఇందులో మొత్తం ఐదుగురు నిందితులున్నారు. వారిని అదుపులోకి తీసుకున్నాం. అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపెడతాం. దేశవ్యాప్తంగా జులై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్ మొదలైంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి, జులై నెలల్లో కనిపించకుండా పోయిన పిల్లలను ప్రత్యేకంగా రెస్క్యూ చేస్తాం. చైల్డ్ హోమ్స్‌కు పంపిస్తాం.కోల్‌కతాకు చెందిన రహనుమా అలీ అనే మహిళకు 2021లో వివాహం జరిగింది. కానీ ఇంకా పిల్లలు పుట్టలేదు. బజారాహిల్స్‌లో ఉండే తన చిన్నమ్మ నిమ్మి జహాని అలియాస్ సీమాకు ఓ పాపను దత్తతకు ఇప్పించమని చెప్పింది. సీమా నేరేడ్‌మెట్‌లో నివసించే తన స్నేహితురాలు నాజియాకు ఈ విషయాన్ని చెప్పింది. నాజియా తనకు కాబోయే భర్త వికారాబాద్‌కు చెందిన జుబేర్‌కు చెప్పింది. ఇతనికి రహనుమా 1.5 లక్షలు ఆన్‌లైన్‌లో పంపించింది. జుబేర్ వికారాబాద్‌లో తన స్నేహితుడైన ఇర్ఫాన్‌తో కలిసి పథకం రచించారు. ఇర్ఫాన్ చోరీ కేసుల్లో నిందితుడు. వీరిద్దరు కలిసి వారి స్నేహితుడైన ఆరిఫ్ నుంచి ఆటోను అద్దెకు తీసుకున్నారు.పథకం ప్రకారం పాపను తల్లి నుంచి లాక్కుని వెళ్లిపోయారు. అనంతరం పాపను తీసుకుని నేరుగా నాజియా వద్దకు వచ్చి సీమా, రహనుమాకు సమాచారం తెలిపారు. ఈ నెల 1న కోల్‌కతా నుంచి రహనుమా తన బంధువు సర్వారితో కలిసి విమానంలో హైదరాబాద్‌కు వచ్చారు. పాపను తీసుకువెళ్లడానికి సిద్ధమవుతుండగా పోలీసులు చేరుకుని ఆ ముఠాను అరెస్టు చేశారు.

# న్యూజిలాండ్ వీసాల పేరుతో రూ.7.59 లక్షల మోసం

**నిందితుడిని పట్టించిన గ్యాస్ కనెక్షన్**

**కేవైసీ, న్యాట్‌గ్రిడ్, గ్యాస్ ఏజెన్సీ వివరాలతో**


**నిందితుడి ఆచూకీ గుర్తించిన సైబర్ పోలీసులు**

**ఫోన్ నంబర్ల నుంచి గ్యాస్ కనెక్షన్ వరకు దర్యాప్తు**



న్యూజిలాండ్ వెళ్లేందుకు ఉద్యోగ వీసాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.7.59 లక్షలు మోసం చేసిన నిందితుడిని పోలీసులు వినూత్న దర్యాప్తుతో అరెస్టు చేశారు. పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించినప్పటికీ అతడి ఆచూకీ దొరకకపోవడంతో చివరకు గ్యాస్ కనెక్షన్ వివరాలు కీలకంగా మారాయి. గ్యాస్ కనెక్షన్ నమోదైన చిరునామా ఆధారంగా నిందితుడిని గుర్తించి స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో బాధితుడికి మోసపోయిన మొత్తాన్ని తిరిగి చెల్లించినట్లు పోలీసులు తెలిపారు.విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడికి ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్ ద్వారా రాజ్‌కుమార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ఇండికా గ్లోబల్ కంపెనీ యజమానినని పరిచయం చేసుకున్న అతడు, ఇద్దరు అభ్యర్థులకు న్యూజిలాండ్‌లో ఉద్యోగాల కోసం వర్క్ వీసాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకోసం పలు దఫాలుగా తన బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.7.59 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. అనంతరం వాట్సాప్‌లో నకిలీ వీసాల చిత్రాలను పంపించి బాధితుడి నమ్మకాన్ని మరింత పెంచాడు. విమాన టిక్కెట్లు బుక్ చేసి పంపించినట్లు చూపించినా, డబ్బులు అందిన వెంటనే వాటిని రద్దు చేసి రీఫండ్ పొందాడు. బాధితుడు ప్రశ్నించగా మరోసారి టిక్కెట్లు పంపిస్తానని చెప్పి కాలయాపన చేశాడు. చివరకు డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడి కోసం విస్తృత దర్యాప్తు చేపట్టారు. అతడు రెండు మొబైల్ నంబర్లను ఉపయోగిస్తూ ఎక్కువగా వాట్సాప్ ద్వారానే సంభాషించినట్లు గుర్తించారు. అతడు ఉపయోగించిన ఈ-మెయిల్ ఐడీకి అనుసంధానమైన ఫోన్ నంబర్లను విశ్లేషించగా మొత్తం ఆరు నంబర్లు వెలుగులోకి వచ్చాయి. వాటిలో ఒకటి మహిళ పేరుతో నమోదై ఉండటంతో ఆ కోణంలో దర్యాప్తు కొనసాగించారు. నిందితుడి బ్యాంకు ఖాతాకు సంబంధించిన కేవైసీ పత్రాలను పరిశీలించగా పశ్చిమ దిల్లీలోని ఐసీఐసీఐ బ్యాంకు అయోధ్య శాఖలో ఖాతా ఉన్నట్లు తేలింది. ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి విచారణ చేపట్టగా, కేవైసీలో ఉన్న చిరునామాలో రాజ్‌కుమార్ నివసించడం లేదని తెలిసింది. దీంతో పోలీసులు మళ్లీ కేవైసీ పత్రాలను నిశితంగా పరిశీలించగా, నామినీగా నమోదైన వ్యక్తి అతడి భార్యేనని గుర్తించారు. నిందితుడు ఉపయోగించిన సిమ్‌కార్డు కూడా అదే మహిళ పేరుతో ఉండటం కీలక ఆధారంగా మారింది.బ్యాంకు లావాదేవీలను విశ్లేషించగా మోసపూరితంగా పొందిన డబ్బు చివరకు చండీగఢ్‌లోని ఏటీఎంల ద్వారా నగదుగా డ్రా చేసినట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి మరింత లోతుగా విచారణ చేపట్టింది. నిందితుడి భార్య పేరుతో ఉన్న మొబైల్ నంబర్‌కు సంబంధించిన వివరాలను న్యాట్‌గ్రిడ్‌లో పరిశీలించగా, ఆమె పేరుతో గ్యాస్ కనెక్షన్ నమోదై ఉన్నట్లు తేలింది. ఆ కనెక్షన్‌కు సంబంధించిన చిరునామాను సేకరించిన పోలీసులు, గ్యాస్ ఏజెన్సీ నుంచి పంపిన ఎస్ఎంఎస్‌లను పరిశీలించి కనెక్షన్ ఇప్పటికీ వినియోగంలోనే ఉందని, సిలిండర్లు క్రమం తప్పకుండా సరఫరా అవుతున్నాయని నిర్ధారించారు. ఈ ఆధారాలతో స్థానిక పోలీసుల సహాయంతో ఆ చిరునామాకు వెళ్లి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మోసం చేసిన విషయాన్ని ఒప్పుకున్న అతడు బాధితుడికి మొత్తం డబ్బును తిరిగి చెల్లించినట్లు పోలీసులు వెల్లడించారు.

# పడక గది పచ్చగా..



పడక గది పచ్చగా కళకళలాడాలంటే.. కుండీల్లో మొక్కలను పెంచుకోవాల్సిందే! కాకుంటే.. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే సూర్యరశ్మి కావాల్సిందే! అలాంటప్పుడు సూర్యరశ్మి అవసరం లేని మొక్కలను ఎంచుకుంటే చాలు. కొన్ని మొక్కలు తక్కువ కాంతిలోనే చక్కగా పెరుగుతాయి. కాబట్టి, బెడ్రూములోనూ వాటిని భేషుగ్గా పెంచుకోవచ్చు.

**ఫిలోడెండ్రాన్ ప్లాంట్ :** గాలిని శుద్ధి చేయడంలో ఈ మొక్క సమర్థంగా పనిచేస్తుంది. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇల్లు కట్టుకున్నవారికి ఈ మొక్క వరంలాంటిదే! దీన్ని కుండీలో పెంచుకొని.. పడగ గదిలో ఓ మూలన పెట్టేస్తే చాలు. తగినంత సూర్యరశ్మి లేకున్నా.. చక్కగా పెరుగుతుంది. గాలిని శుద్ధి చేస్తుంది. దీన్ని పెంచడం కూడా చాలా సులభం. చీడపీడలు సోకే అవకాశం కూడా ఉండదు. తగినన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

**సింగోనియం ప్లాంట్ :** దీనికే 'యారోహెడ్' అని పేరు. ఈ మొక్క ఆకులు బాణపు తలల్లా ఉంటాయి. కాబట్టే.. ఆ పేరొచ్చింది. ఇవికూడా సులభంగా పెరుగుతాయి. ఆక్సిజన్‌ను పుష్కలంగా అందిస్తుంది. గాలిని శుద్ధి చేస్తుంది. చిన్నచిన్న కుండీల్లోనూ చక్కగా పెరుగుతాయి. పడక గదికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?

**రోజూ ఇలా ట్రై చేస్తే మంచిదంటున్న నిపుణులు!**

**బరువును అదుపులో పెట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదట!**

**ఏం చేయాలో వివరిస్తున్న నిపుణులు!**



బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి కాస్త సమయం పడుతుంది. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువుతో డయాబెటిస్, హైబీపీ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరగడంతో పాటు కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదంటున్నారు. దీనికీ ఒక పద్ధతి ఉందని సూచిస్తున్నారు. మరి, అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం!శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల అదనపు శక్తి కొవ్వుగా మారి, బరువు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశాలు దీనికి కారణమవుతుంటాయని అంటున్నారు. అలాగే, బరువు పెరగటంలో కొన్ని రకాల జన్యువులు, మందులూ దీనికి దోహదం చేయొచ్చని పేర్కొంటున్నారు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదని, చిన్న చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతాయని వెల్లడిస్తున్నారు.

**లెక్క ప్రకారం :** శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 18.5–24.9లోపు ఉండటం మంచిదని, 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారని %చీ×ని% అధ్యయనం పేర్కొంది. బరువును లెక్కించటానికి తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ, ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదంటున్నారు నిపుణులు. శరీరంలోని నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయని చెబుతున్నారు. వాస్తవానికి, ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే అని తెలియజేస్తున్నారు. దీని మూలంగా పెరిగినట్టయితే నెమ్మదిగా, వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని అనుకుంటారు. కానీ, ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుందని వివరిస్తున్నారు. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని పేర్కొంటున్నారు.

**ఆహారం విషయంలో :** బరువు తగ్గటానికి.. ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరంటున్నారు నిపుణులు. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతారని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలని సలహా ఇస్తున్నారు. రోజూ రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యమంటున్నారు నిపుణులు. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. శారీరక శ్రమను పెంచడం, ఆహారపు అలవాట్లను మార్చడం ద్వారా కేలరీలు తీసుకోవడం తగ్గించుకోవాలని %చీఖఅశీఝశ్రీ ాఅఎత్ఝతీఎ శీట వీవఅఅఎఅఅవ% అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో కేలరీలను లెక్కించుకొని తినటం ఎలా సాధ్యమని చాలామంది అనుకుంటారు. కానీ, మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుందంటున్నారు. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిదని, గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెదడుకు తెలియదని పేర్కొంటున్నారు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**శ్రమ సాయం :** క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల బరువు, రక్తపోటు, ఒత్తిడి తగ్గుతుందని %హాఎవతీఅఝఅ నఝతీ ాంంశీఎఝఅశీఅ% అధ్యయనం పేర్కొంది. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ బరువు తగ్గడానికి దోహదం చేస్తాయంటున్నారు. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయకూడదని, క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయామాలైనా చేయాలని, వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయని పేర్కొంటున్నారు. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయని సలహా ఇస్తున్నారు. బరువులు ఎత్తటం వంటి కండరాలను దృఢం చేసే వ్యాయామాలనూ మరవరాదని, పెద్దవాళ్లు వారానికి కనీసం రెండు రోజులైనా ఇలాంటివి సాధన చెయ్యాలని పేర్కొంటున్నారు.

# షుగర్ పేషెంట్స్ సీతాఫలం' తినొచ్చా?

**సీతాఫలంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు - గుండె పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణుల వెల్లడి!**



ప్రకృతి ప్రసాదించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. ఆపిల్ రంగూ, మామిడి రుచీ లేని కొండ పండు ఇది. అయితే ఎంత తిన్నా తనివి తీరని ఈ పండు ఎన్నో అనారోగ్యాల్ని నయం చేస్తుందంటున్నారు నిపుణులు. సీతాఫలంలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అనేవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహకరిస్తాయని చెబుతున్నారు. మరి డయాబెటిస్?తో ఇబ్బందిపడేవారు ఈ పండ్లను తినొచ్చా? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

**రోగనిరోధక శక్తి పెరుగుదల :** సీతాఫలంలో ఎ, సి, బి6 వంటి విటమిన్లతో పాటు కాపర్, పొటాషియం, పీచు వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్ సి అనేది రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందని The Pharma Innovation Journal ప్రచురించింది. అలాగే, ఇందులోని యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడిన వాపును తగ్గించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.

'గుండెకు' ముప్పు తెచ్చే అలవాట్లు ఇవే! - వీటికి దూరంగా ఉండాలంటున్న నిపుణులు

**గుండె ఆరోగ్యానికి :** సీతాఫలంలో అధిక మెగ్నీషియం కంటెంట్ మృదువైన గుండె కండరాలను సడలించి, స్ట్రోక్, గుండెపోటును నివారిస్తుందని అధ్యయనం పేర్కొంది. ఇందులోని ఫైబర్, నియాసిన్ శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**షుగర్ కంట్రోల్ :** ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల చక్కెర శోషణ నెమ్మదిగా జరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. సీతాఫలంలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుందని, ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్? డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. అయితే మరీ ఎక్కువ మొత్తంలో కాకుండా మితంగా, డాక్టర్ల సూచన మేరకు తినాలని చెబుతున్నారు.

**గర్భిణులకు :** గర్భం దాల్చిన మహిళల్లో వేవిళ్లు, మూడ్ స్వింగ్స్?, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం లాంటి సమస్యలు కామన్?. అయితే వీటిని సీతాఫలంతో చెక్ పెట్టొచ్చంటున్నారని నిపుణులు. ఇందులో కాపర్ ఎక్కువ మొత్తంలో లభిస్తుందని, దీంతో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు. అంతేకాకుండా, పిండం అభివృద్ధిలో సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. గర్భాధారణ సమయంలో సీతాఫలం తినడం వల్ల, పుట్టబోయే శిశువు మెదడు, నాడీ వ్యవస్థ, రోగనిరోధక శక్తి అభివృద్ధికి తోడ్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు కాపర్ తక్కువైతే పూర్తిగా నెలలు నిండకుండానే బిడ్డ పుట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీరు సీతాఫలం తినడం మంచిదని సూచిస్తున్నారు.

**బరువు అదుపులో :** సీతాఫలంలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే, ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. దీంతో ఎక్కువ సమయం ఆకలేయకుండా, చిరుతిండ్ల జోలికి పోకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. తద్వారా క్రమంగా బరువు తగ్గచ్చని సూచిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్ బి6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

**పీసీఓఎస్ ఉన్నవారు :** పీసీఓఎస్ ఉన్న వారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు వంటివి సర్వసాధారణంగా ఉంటాయి. అయితే వీటన్నింటికీ ఐరన్ విరుగుడుగా పనిచేస్తుందని, సీతాఫలంలో అది ఎక్కువగా లభిస్తుందని అంటున్నారు నిపుణులు. కాబట్టి, పీసీఓఎస్ ఉన్న వారూ ఈ పండు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే, ఇది సంతాన సాఫల్యతను సైతం పెంచుతుందని తెలియజేస్తున్నారు.

**ఇవీ కూడా :**

ఈ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి. ఇందులో బి- కాంప్లెక్స్ అధికంగా ఉండటం వల్ల మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ పండులో విటమిన్ రైబోఫ్లేవిన్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్?తో పోరాడి కంటిచూపును మెరుగుపరచడంతో పాటు కంటి సమస్యల్ని నివారిస్తాయి. సీతాఫలంలో అధికంగా ఉండే డైటరీ పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అయితే సీతాఫలం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది కదా అని ఎక్కువగా తినడం కూడా శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. అలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండు మోతాదు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నిపుణుల్ని అడిగి తెలుసుకోవడం మంచిదంటున్నారు.

# ధనియాలతో నీళ్లను ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!

జశీతీఱఅఅవతీ ాavvaం ఝ్వతీ% ఎ ధనియాలను మనం వంటి ఇంటి మసాలా దినుసులుగా ఎప్పటినుంచో ఉపయోగిస్తున్నాం. అయితే ఆయుర్వేద ప్రకారం ఈ దినుసులు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ ధనియాలను ఉపయోగిస్తారు. అలాగే మసాలా వంటకాల్లోనూ వీటిని వాడుతారు. అయితే కేవలం రుచి, వాసనను అందిండమే కాదు, మనకు ఇవి ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తాయి. ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలతో తయారు చేసే నీళ్లను తాగితే ఎంతో మేలు జరుగుతుందని వారు చెబుతున్నారు. ధనియాల నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గిపోతాయి.



### షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..

ధనియాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను బాగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ధనియాల నీళ్లను తాగితే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. వీటిల్లో క్వర్సెటిన్, టెర్పినైన్, టోకోఫెరాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ధనియాల నీళ్లను తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### ఏ సమయంలో తాగాలి..?

బరువు తగ్గాలనుకునే వారు, లివర్ వ్యాధులు ఉన్నవారు, చర్మ సమస్యలకు కూడా ధనియాల నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మోకాళ్లు, కీళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ధనియాల నీళ్లను తాగితే మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా మారుతారు. నీరసం, అలసట తగ్గిపోతాయి. ధనియాల నీళ్లను రోజూ ఉదయం పరగడుపునే తాగవచ్చు. లేదా భోజనం చేయడానికి 45 నిమిషాల ముందు తాగాలని ఆయుర్వేదం చెబుతోంది. ధనియాలను రాత్రి పూట నీటిలో నానబెడితే మరుసటి రోజు మొత్తం ఆ నీళ్లను కొద్ది కొద్దిగా కూడా తాగుతూ ఉండవచ్చు.

### ఇలా కూడా చేయవచ్చు..

ఇక ధనియాల నీళ్లను కేవలం ధనియాలను నానబెట్టి మాత్రమే కాదు, ధనియాలను నీటిలో వేసి మరిగించి కూడా తయారు చేయవచ్చు. ఇలా ఏ రకంగా అయినా సరే ధనియాల నీళ్లను తయారు చేసి తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలు అనేక వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయని అంటున్నారు. అలర్జీలు ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు ధనియాల నీళ్లను తాగకూడదు.

# రోజూ దీన్ని 2 కప్పులు తాగితే చాలు.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



రోజూ ఉదయం నిద్ర లేచిన దగ్గరి నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు చాలా మంది టీ, కాఫీలను అధికంగా తాగుతుంటారు. వాతావరణం చల్లగా ఉంటే టీ, కాఫీలు ఇంకా ఎక్కువగా తాగుతారు. అయితే టీ, కాఫీలకు బదులుగా హెర్బల్ టీలను తాగితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని, దీంతోపాటు టీ, కాఫీ తాగిన ఫీలింగ్ కూడా కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే మనకు తాగేందుకు అనేక రకాల హెర్బల్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కొంబుచా టీ కూడా ఒకటి. టీ, చక్కెర, బ్యాక్టీరియా, ఈస్ట్‌ను కలిపి పులియబెట్టి ఈ టీ పొడిని తయారు చేస్తారు. దీన్నే కొంబుచా టీ అంటారు. ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంబుచా టీని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వారు అంటున్నారు.

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

కొంబుచా టీ అంటే పులియబెట్టబడింది కనుక ఈ టీని సేవిస్తే ప్రోబయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అంటే ఈ టీ మన జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అజీర్తి తగ్గుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గిపోతుంది. విరేచనాలు, ఇరిటబుల్ బౌల్ సింద్రోమ్ (ఐబీఎస్) వంటి సమస్యలు ఉన్నవారు కొంబుచా టీని సేవిస్తుంటే ఉపశమనం లభిస్తుంది. కొంబుచా టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండడం వల్ల ఈ టీని సేవిస్తుంటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, వయస్సు మీద పడడం వల్ల వచ్చే జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.

### లివర్ ఆరోగ్యానికి..

కొంబుచా టీ లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజూ ఈ టీని తాగుతుంటే అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో లివర్‌లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది. లివర్ సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఈ టీ ఎంతగానో మేలు చేస్తుంది. ముఖ్యంగా మద్యం కారణంగా వచ్చిన ఫ్యాటీ లివర్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొంబుచా టీని తాగితే మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### డయాబెటిస్ ఉంటే..

ఈ టీని తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గిపోతాయి. కొంబుచా టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కొంబుచా టీని తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ టీ బరువును కూడా తగ్గించగలదు. దీన్ని తాగితే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు త్వరగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు ఈ టీని డైట్‌లో కచ్చితంగా చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా కొంబుచా టీని రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# బేబీ బంప్‌తో వర్కౌట్ చేస్తున్న సమంత



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫోటో డంప్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా వీడియోలో ఆమె లుక్‌పై నెట్టింట విస్తృతంగా చర్చ జరుగుతోంది.తాజా వీడియోలో సమంత జిమ్‌లో అప్పర్ బాడీ వ్యాయామాలు చేస్తూ కనిపించింది. ఫిట్‌నెస్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే సమంత, కఠినమైన వ్యాయామాలను ఎంతో నిబద్ధతతో పూర్తి చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రతి సెట్ అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ వ్యాయామం కొనసాగించింది. అయితే, ఈ వీడియో నేపథ్యంలో సోషల్ మీడియాలో సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక ఊహాగానాలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉన్నారనే ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతూ రాగా, దీనిపై సామ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవల మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో తాను ప్రగ్నెంట్ చెప్పుకొచ్చింది. అయితే ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భధారణ సమయంలో వ్యాయామం చేయాలనుకునే వారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, పర్యవేక్షణలోనే తగిన వ్యాయామాలు చేయాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి భిన్నంగా ఉండటంతో, ఒకరికి అనుకూలమైన వ్యాయామం మరొకరికి సరిపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు, సమంత తన కెరీర్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొత్త అడుగులు వేస్తూ విభిన్న కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫిట్‌నెస్ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.

# 'బ్లాస్ట్' దర్శకుడితో సినిమా?



తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లాస్ట్' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే టాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు సుభాష్ కె రాజ్. అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఓటీటీలో సైతం ఆదరణ చూరగొంటున్నది. దర్శకుడు సుభాష్ కె రాజ్ ఎంచుకున్న కాన్సెప్ట్, మేకింగ్‌స్టైల్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ యువ దర్శకుడితో హీరో నాని ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలావుండగా నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్' షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఆగస్టులో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆయన సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే.



# సుకుమార్ - దేవిశ్రీ ప్రసాద్ కాంబోకి బ్రేక్.. రామ్ చరణ్ సినిమా నుండి డీఎస్పీ ఔట్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రేజీ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రూపుదిద్దుకోబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం చ=జ17 మ్యూజిక్ డైరెక్టర్ మార్పుకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక సంచలన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ నుండి సుకుమార్ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తప్పుకున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'రంగస్థలం' తర్వాత రాబోతున్న సినిమా కావడంతో, దేవిశ్రీ ఈ ప్రాజెక్ట్‌లో లేరనే ప్రచారం మెగా అభిమానులతో పాటు సినీ ప్రియులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ షాకింగ్ మార్పు వెనుక ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' చిత్రం సమయంలో తలెత్తిన కొన్ని క్రియేటివ్ డిఫరెన్సెస్ ఉన్నట్లు తెలుస్తోంది. పుష్ప 2 బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (దీ+వీ) మరియు రీ-రికార్డింగ్ పనులలో అనుకున్న సమయానికి అవుట్‌పుట్ రాకపోవడం, ఆ కారణంగా ఇతర మ్యూజిక్ డైరెక్టర్ల సేవలను సుకుమార్ ఉపయోగించుకోవాల్సి రావడం వంటి పరిణామాల వల్లే దేవిశ్రీతో సుకుమార్ బంధానికి బ్రేక్ పడిందని ఇండస్ట్రీ టాక్. ఈ క్రమంలోనే దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో సరికొత్త సంగీతాన్ని అందించేందుకు బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ శాశ్వత్ సచ్‌దేవ్‌తో పాటు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్స్ హర్షవర్ధన్ రామేశ్వర్ లేదా సాయి అభ్యంకర్ ల పేర్లను సుకుమార్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2024 హోలీ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించినప్పుడు పోస్టర్‌పై దేవిశ్రీ ప్రసాద్ పేరే ఉన్నప్పటికీ, తాజా మార్పులపై మైత్రీ మూవీ మేకర్స్ లేదా సుకుమార్ టీమ్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం సుకుమార్ స్క్రిప్ట్ వర్క్‌ను పక్కాగా సిద్ధం చేసే పనిలో ఉండగా, రామ్ చరణ్ తన ప్రస్తుత చిత్రం 'పెద్ది' పూర్తయిన తర్వాత దసరా సీజన్ ముగిశాక ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే అవకాశం ఉంది, అప్పటివరకు ఈ మ్యూజిక్ డైరెక్టర్ సస్పెన్స్‌కు తెరపడకపోవచ్చు.

# మళ్లీ గ్యాప్ తీసుకుంటే మా ఇంటికొచ్చి కొట్టండి



అక్కినేని కుటుంబం నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. 'లెనిన్' విడుదలైన వెంటనే ఇప్పటికే విన్న పలు కథల్లో మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయనున్నట్లు వెల్లడించారు. గత చిత్రం ఏజెంట్ తర్వాత ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నకు కూడా అఖిల్ సమాధానం ఇచ్చారు.సినిమా విడుదలైన మూడు నెలల తర్వాత ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి గాజు ముక్కలపై పడటంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైందని తెలిపారు. ఆ ప్రమాదం కారణంగా రెండు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చిందని, మొత్తం 48 కుట్లు పడ్డాయని చెప్పారు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 16 నెలలు పట్టిందని, అనంతరం సరైన కథ కోసం కూడా కొంత సమయం కేటాయించాల్సి వచ్చిందని వివరించారు.ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 'లెనిన్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో కూడా అఖిల్ భావోద్వేగంగా మాట్లాడారు. ఈసారి నేను ఎక్కువగా మాట్లాడను. నా సినిమానే మాట్లాడుతుంది. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన్'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంతో అఖిల్ తన కెరీర్‌లో బలమైన విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

EDITOR, PRINTER AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri -515411,Anantapur District Andra Pradesh,Published at #1/111, SC PETA,RAMPAYARRAM PALEM,GOKARAM (V&P),GOKARAM (M), GOKARAM.EAST GODAVARI-533286Andra Pradesh EDITOR B.JAVEED BASHA PRGI. NO : APTEL/26/A4786, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com